క్లుప్తంగా

మోడల్ పరీక్షకు స్పందన



కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

విజయనగరం అర్బన్: సత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలలో మంగళవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ కానిస్టేబుల్ మెయిన్స్ మోడల్ పరీక్షకు విశేష స్పందన లభించింది. నాయుడు ఎగ్జామ్ వారియర్స్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 157 మంది అభ్యర్థులు హాజరై తమ ప్రతిభను ప్రదర్శించారు. పరీక్ష నిర్వహణలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, వారియర్స్ సంస్థ డైరెక్టర్ రాముసాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంపీసాయిదేవమణి పాల్గొన్నారు.

రక్తదానం



రక్తదాతలు

విజయనగరం: సేవా కార్యక్రమాలే స్ఫూర్తిగా ముందడుగు వేస్తోన్న విజయనగరం యూత్ ఫౌండేషన్ సంస్థ మంగళవారం విభిన్న కార్యక్రమం చేపట్టింది. దివంగత చల్లా సతీష్ జయంతి సందర్భంగా స్థానిక కోట జంక్షన్‌లో గల విజయ రక్తనిధి కేంద్రంలో విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. శిబిరంలో 30 మంది రక్తదానం చేశారు. అనంతరం నరవ జంక్షన్ వద్ద ఉన్న ఏఎంజీ కాలనీలో వందమంది నిరాశ్రయులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్షుడు షేక్ ఇల్తమాష్, కార్యవర్గ సభ్యులు అనకాపల్లి అశోక్, సాయి కుమార్, రాయల్ క్యాబ్స్ శరత్, పి.రఘు, రాము, పి.రఘు, విజయ్, వినయ్, సాయి ప్రసాద్, విజయ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ పుణ్యమంతుల శివ, గణేష్, హరీష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు



లంకలపల్లిపాలెంలో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్ఐ, గ్రామస్తులు

పూసపాటిరేగ: మండలంలోని లంకలపల్లిపాలెంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ ఐ.దుర్గాప్రసాద్ మంగళవారం తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు నియంత్రించవచ్చన్నారు. రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలను అరికట్టవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు రౌతు సాయికుమార్, పసుపులేటి మహేష్, రౌతు ఉపేంద్ర, ఇనపకుర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ



శిక్షణ పొందిన పొదుపు సంఘాల మహిళలతో నిర్వాహకులు

విజయనగరం అర్బన్: సంకల్ప్ పథకం కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జన శిక్షణా సంస్థాన్ ద్వారా స్థానిక టీటీడీసీలో నెల రోజుల పాటు నిర్వహించిన 'జ్యూట్ బ్యాగ్ తయారీ' శిక్షణా తరగతుల మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సభలో నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి జి.ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ శిక్షణ పొందిన మహిళలు అందరు నైపుణ్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జన శిక్షణా సంస్థాన్ చైర్మన్ డి.రమేష్, డైరెక్టర్ వి.హరీష్, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏడీఎస్‌డీఓ ఎస్.షణ్ముఖ రెడ్డి, ప్లేస్మెంట్ అధికారి టి.భాస్కర్ పాల్గొన్నారు.

జాతరలో పారిశుధ్య పనులకు మున్సిపల్ సిబ్బంది

నెల్లిమర్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో శివరాత్రి జాతర సందర్భంగా పారిశుధ్య పనులకు 15 మంది సిబ్బందిని పంపిస్తున్నట్లు నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్ కె.అప్పలరాజు తెలిపారు. జాతరలో ఎప్పటికప్పుడు చెత్తను తరలించేందుకు రెండు వాహనాలు అందుబాటులో ఉంచుతామని చెప్పారు. మంగళవారం సాయంత్రం నుంచి గురువారం సాయంత్రం వరకు రామతీర్థంలో పారిశుధ్య పనులు కొనసాగిస్తామని కమిషనర్ పేర్కొన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

బొబ్బిలి: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ మండపం వద్ద పట్టణానికి చెందిన శ్రీమన్నారాయణ నాయీ బ్రాహ్మణ సంఘ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. సంఘ గౌరవాధ్యక్షుడిగా బర్లి అప్పారావు, అధ్యక్షుడిగా బర్లి చిన్నారావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చిలకలపల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా సుందరాడ వెంకటపాపారావు, ప్రధాన కార్యదర్శిగా రేజేటి రమేష్, కోశాధికారిగా ఎ.చిన్నారావు ఎంపికయ్యారు.

ఉత్సవాలకు సర్వం సిద్ధం



రామక్షేత్రం చుట్టూ ఏర్పాటు చేసిన టెంట్లు



ఉమాసదాశివాలయంలో పూల అలంకరణలో మహిళలు

- రామతీర్థంలో నేటి నుంచి మహా జాతర

నెల్లిమర్ల రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ రామస్వామివారి దేవస్థానంలో బుధవారం నుంచి రెండు రోజుల పాటు శివరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి దాదాపు లక్షకు పైగానే భక్తులు ఈ జాతరకు రానున్నారని అంచనా. దేవస్థాన, ఇతర శాఖల సిబ్బంది ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రామాలయం, శివాలయం వద్ద టెంట్లు, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అలాగే రామకోనేరు వద్ద భక్తుల స్నానాలకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. యాత్రికులను కనువిందు చేసేందుకు ఇప్పటికే పలు రకాల సర్కస్ కేంద్రాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. విజయనగరం వైపుగా వచ్చే భక్తులకు సీతారామునిపేట వద్ద, రణస్థలం వైపుగా వచ్చే భక్తులకు దన్నానపేట జంక్షన్ వద్ద పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే జాతరలో ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు సుమారు 200 మంది పోలీస్‌లు విధులు నిర్వర్తించనున్నారు. పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు తమ సేవలను అందించనున్నారు. శాశ్వత కేశ ఖండనశాల వద్ద పోలీస్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ప్రథమ చికిత్స అందించేందుకు నెల్లిమర్ల, కొండవెలగాడ వైద్య సిబ్బందితో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఉమా సదా శివాలయంతో పాటు రామాలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. శనివారం వేకువజాము నుంచి రణస్థలం, విజయనగరం కేంద్రాల నుంచి ఆర్టీసీ బస్సులు సేవలందిస్తాయి. బోడికొండ సందర్శనకు వెళ్లే భక్తులు జాగ్రత్తలు పాటించాలని హెచ్చరిక బోర్డులను అనుసరించి వెళ్లాలని దేవదాయ శాఖతో పాటు పోలీస్ యంత్రాంగం సూచించింది.

శివాలయంలో ప్రత్యేక పూజలు

మహాశివరాత్రి పర్వదినాన శివాలయంలో ప్రత్యేక పూజలు జరగనున్నాయి. బ్రహ్మ ముహుర్త కాలంలో గణపతి పూజ, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కామాక్షి అమ్మవారికి హారతి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటలకు గణపతి పూజ, మహాన్యాస పారాయణాలు జరిపించి 11 రకాల ఫండ్ల రసాలు, బస్మ చందన, హరిద్రా కుంకుమ, సుగంధ ద్రవ్యాలు, నారికేళ జలాలతో శివుడికి అభిషేకాలు జరిపిస్తారు. అర్ధ రాత్రి 12 గంటలకు మహా లింగోద్భవ సమయంలో స్వామికి విభూది సమర్పణ చేస్తారు.

నిరంతరం నిఘా

నెల్లిమర్ల : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శివరాత్రి జాతరలో పూర్తిగా మద్యం నిషేధించినట్లు ఎక్సైజ్ సీఐ వెంకటరావు తెలిపారు. డ్రై డే సందర్భంగా మంగళవారం సాయంత్రం 4 నుంచి గురువారం సాయంత్రం 4 గంటల వరకు అన్ని మద్యం దుకాణాలు మూసి వేస్తున్నట్లు చెప్పారు. జాతరలో ఎవరైనా మద్యం సేవించి పట్టుబడినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాతర సందర్భంగా 26, 27 తేదీల్లో రామతీర్థంలో నిరంతరం గస్తీ నిర్వహిస్తామని సీఐ పేర్కొన్నారు.

శతశాతం పన్నుల వసూలు లక్ష్యం



2024 – 25 ఆర్థిక సంవత్సరానికిగాను ఆస్తి పన్ను వసూళ్లను వేగవంతం చేసి లక్ష్యాలను చేరుకోవాలని అడ్మిన్ కార్యదర్శులకు విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ప్రతిరోజు సచివాలయాల వారీగా వసూలు చేస్తున్న ఆస్తి పన్ను వివరాలపై సమీక్షించారు. తక్కువగా పన్ను వసూలు చేసిన కార్యదర్శులను మందలించారు. ఆర్థిక సంవత్సరం ముగింపునకు కొద్ది రోజులే మిగిలి ఉన్న కారణంగా ఇకనైనా శ్రమించి పన్ను వసూళ్లను శతశాతం జరిగే విధంగా చూడాలని ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, ఏఓ సీతారామమూర్తి, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు. – విజయనగరం

సీఎంకు పోస్టుకార్డు వినతి



మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తూ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో నిర్ణయం చేయాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో కార్మికులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు పోస్టు కార్డు ద్వారా విన్నవించారు. విజయనగరం కార్పొరేషన్ కమిటీ ఆధ్వర్యంలో సీఎంకు పోస్టుకార్డు ద్వారా తమ వినతులను తెలియజేసేందుకు స్థానిక కేంద్ర పోస్టాఫీసు బాక్సులో మంగళవారం కార్డులు వేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్ష కార్యదర్శులు ఎ.జగన్మోహనరావు, బి.భాస్కరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి తొమ్మిది నెలలైనా మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కుమారి, రమా, రాధ, గౌరి, తిరుమలరావు, పైడిరాజు, రాఘవ, రమణ, రామారావు, అప్పలరాజు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం గంటస్తంభం

నవ్వి పోదురుగాక..!



శివరాత్రి జాతరకు నెల్లిమర్ల – రణస్థలం రహదారిలో గోతులు పూడ్చుతామన్న ఆర్అండ్‌బీ అధికారులు పత్తా లేకుండా పోయారు. శివరాత్రి సందర్భంగా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేల సంఖ్యలో భక్తులు రామతీర్థం దేవస్థానానికి విచ్చేస్తారు. నెల్లిమర్ల నుంచి ఎంబీరేయగుళ్ల వరకు రహదారిలో గోతులు ఏర్పడడంతో తాత్కాలిక మరమ్మతులు చేపడతామని ఆర్అండ్‌బీ అధికారులు ప్రకటించారు. శివరాత్రి ఉత్సవాలు సమీపించినప్పటికీ ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టలేదు. ఉత్సవాలు జరిగే రామతీర్థం గ్రామంలోనే పెద్ద గోతులు దర్శనమిస్తున్నాయి. దీంతో ఇదేనా.. అధికారుల చిత్తశుద్ధి అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. – నెల్లిమర్ల రూరల్

గంటలోనే.. ఆస్పత్రికి తరలించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ మురళీకృష్ణ

విజయనగరం ఫోర్ట్: పాము కాటేసినప్పుడు రోగిని కదిలించకుండా గంట వ్యవధిలో ఆస్పత్రికి తరలిస్తే వంద శాతం రికవరీ చేయవచ్చునని జనరల్ ఫిజీషియన్ డాక్టర్ జి.మురళీకృష్ణ అన్నారు. స్థానిక క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం కార్యవర్గ సభ్యులకు మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఐదు జాతుల సర్పాలు మాత్రమే విషపూరితమైనవని తెలిపారు. పచ్చ కామెర్లు వ్యాధికి గ్రామీణ ప్రాంతాల్లో పసర మందులు వాడడం వల్ల కాలేయం పూర్తిగా దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ కె.చైతన్య, గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన



సాంస్కృతిక ప్రదర్శనలో చిన్నారులు

విజయనగరం టౌన్: స్థానిక మూడులాంతర్లు వద్దనున్న పైడితల్లి అమ్మవారి చదురుగుడి ఆవరణలో ఉన్న ఆధ్యాత్మిక కళావేదిక వద్ద మంగళవారం రాత్రి నిర్వహించిన శ్రీ వైష్ణవి కళాక్షేత్రం చిన్నారుల భరతనాట్య ప్రదర్శన ఆద్యంతం ఆహుతులను ఆకట్టుకుంది. ఆలయ ఇన్‌చార్జి కెఎన్‌విడి.ప్రసాద్ పర్యవేక్షణలో నృత్యదర్శకులు జయలక్ష్మి, షీలా రమణమూర్తి, 15 మంది చిన్నారులను ఘనంగా సత్కరించారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గుర్ల గెడ్డ ప్రాజెక్టుకు రూ.20 కోట్ల నిధులు కేటాయించాలి

మెంటాడ: మండల పరిధిలోని గుర్ల గెడ్డ ప్రాజెక్టు(రిజర్వాయరు) పూర్తి చేసేందుకు రూ.20 కోట్ల నిధులు కేటాయించాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు ఓ ప్రకటనలో మంగళవారం డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో రిజర్వాయరు నిర్మాణానికి నిధులు కేటాయించి, ఇవ్వాలన్నారు. 1998లో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, మట్టి పనులతో పాటు కొంతవరకు కాలువల పనులు చేసి వదిలేశారన్నారు. 2017లో నిర్మాణం పూర్తికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించడం జరిగిందని, ఇదే రిజర్వాయరు పూర్తయితే 1630 ఎకరాలకు సాగునీరు పుష్కలంగా అందుతుందన్నారు. నిర్మాణం ప్రారంభించి, నేటికి 26 ఏళ్ల గడిచినా రిజర్వాయరు పూర్తి కాలేదన్నారు. ఇప్పటికైనా బడ్జెట్‌లో నిధులు కేటాయించి, నిర్మాణ పూర్తికి సహకరించాలని కోరారు.

జ్ఞానజ్యోతితో చిన్నారులకు మెరుగైన విద్య



మాట్లాడుతున్న ఎంఈఓ పాపినాయుడు తదితరులు

పూసపాటిరేగ: జ్ఞానజ్యోతి కార్యక్రమంతో చిన్నారులకు మెరుగైన విద్య అందుతోందని ఎంఈఓలు బి.పాపినాయుడు, ఎం.రాజ్‌కుమార్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి శిక్షణ ముగింపు కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్ర స్థాయిలో అమలు చేయాలని అన్నారు. పూర్వ ప్రాథమిక స్థాయిలోనే పిల్లల ఆరోగ్య రక్షణ, శారీరక, సామాజిక భావోద్వేగాలు అభివృద్ధి చూడటం, అక్షరాలతో భవితకు భరోసా కల్పించాలన్నారు. జ్ఞానజ్యోతి కార్యక్రమం లక్ష్యాలను నెరవేర్చవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. 120 రోజుల వృత్యంతర శిక్షణలో మొదటి విడతగా ఆరు రోజుల శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.శంకర్రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సత్యవతి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆలోచనాత్మకం కన్యాశుల్కం నాటకం



కన్యాశుల్కం నాటకంలో ఆకట్టుకున్న దృశ్యం

విజయనగరం టౌన్: గురజాడ ఆర్ట్స్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి గురజాడ కళాభారతి వేదికపై కళాకారులు నిర్వహించిన కన్యాశుల్కం సంక్షిప్త దృశ్య రూపకం ప్రదర్శన ఆద్యంతం ఆలోచనాత్మకంగా నిలిచింది. ప్రతీ సన్నివేశం ఓ అపురూప ఘట్టంగా నటీనటులు తీర్చిదిద్ది అందరి మన్ననలు పొందారు. నంది అవార్డు గ్రహీత కెవి.పద్మావతి మధురవాణిగా, ప్రధాన విజయరామ్ గిరీశంగా, సుధాకర్ పట్నాయక్ అగ్నిహోత్రావధాన్లుగా, పిఎవిఎన్.శాస్త్రి లుబ్ధావధాన్లుగా అద్భుతమైన ప్రదర్శన చేశారు. కరటకశాస్త్రిగా పసుమర్తి సన్యాసిరావు, రామప్ప పంతులుగా జిఎస్.చలం నాటకానికి జీవం పోశారు. సౌజన్యారావు పంతులుగా పాశల మహేష్, పూజారి గవరయ్యగా పి.చంద్రినాయుడు, వెంకమ్మగా సంధ్యా ప్రియదర్శిని, బుచ్చమ్మగా ఎం.సునీతారాణి, పూట కూళ్లమ్మగా బి.జ్యోతి, మీనాక్షిగా గంటా లక్ష్మి, మహేశంగా వివిఆర్.మూర్తి, వెంకటేశంగా ఎస్.వశీకర్‌లు తమదైనశైలిలో పాత్రలను పోషించి ఆహుతుల మన్ననలు పొందారు. రత్నాల బాలకృష్ణ, షేక్ గౌస్‌భాషాల నిర్వహణలో నిర్వహించిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో కళాభిమానులు పాల్గొన్నారు.

గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి

- కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య



ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్

విజయనగరం: నిర్ణీత గడువులోగా నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులు పూర్తి చేయాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య ఇంజనీరింగ్ సిబ్బందికి ఆదేశించారు. తన చాంబర్‌లో ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. వేసవి కార్యాచరణ, నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల ప్రగతి, చేపట్టాల్సిన పనులు వంటి అంశాలపై చర్చించారు. వేసవి కాలంలో ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని చెప్పారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులు నిర్ణీత గడువులోగా పూర్తి కావాలన్నారు. చెరువుల పరిరక్షణ, పర్యవేక్షణ కోసం నియమించిన సిబ్బంది మరింత బాధ్యతగా విధులు నిర్వహించాలని అన్నారు. తాగునీటి పంపిణీలో అలసత్వం ఉండరాదన్నారు. 15 రోజులకు ఒకసారి తప్పనిసరిగా వాటర్ ట్యాంకులను శుభ్రపరిచే విధంగా పర్యవేక్షణ ఉంచాలన్నారు. వీధిదీపాల సక్రమ నిర్వహణ మరింత సమర్థవంతంగా ఉండాలన్నారు. రహదారుల మరమ్మత్తు పనులు, గుంతల పూడ్చివేత పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. ఈఈ టి.రాయల్‌బాబు, డీఈలు మణికుమార్, శ్రీనివాసరావు, ప్రసాద్, ఏఈలు పాల్గొన్నారు.

అనుమతుల్లేని నిర్మాణాలపై చర్యలు

అనుమతులు లేకుండా ఎట్టి నిర్మాణాలను చేపట్టరాదని కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఎంఎస్ఎన్ కాలనీలో క్షేత్ర స్థాయి పర్యటన చేస్తున్న సందర్భంగా అనుమతి లేకుండా నిర్మాణం చేపడుతున్న పరిస్థితిని గమనించారు. వెంటనే నిర్మాణాన్ని తొలగించి వేయాలని సిబ్బందికి ఆదేశించారు. దీంతో ప్రణాళిక సిబ్బంది ఎట్టి అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణ ప్రక్రియను తొలగించి వేశారు. పిల్లర్ల వరకు వేసిన నిర్మాణాన్ని కూల్చి వేశారు. రహదారులను ఆక్రమించి ఏర్పాటు చేసిన కార్ షెడ్లను, ఇతర ఏర్పాట్లను సిబ్బంది తొలగించి వేశారు.

వృద్ధులతో ప్రేమగా వ్యవహరించాలి



వృద్ధులకు ఫ్రూట్స్, డైపర్స్‌ను అందజేస్తున్న నాలుగెస్సుల రాజు, తదితరులు

విజయనగరం టౌన్: వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని ప్రేమసమాజం అధ్యక్షుడు పెద్దింటి అప్పారావు సూచించారు. స్థానిక ప్రేమ సమాజం ఆవరణలో మంగళవారం సాయంత్రం కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులను కంటికి రెప్పలా కాపాడుకోవాలని, అనాథలైన వారిని అక్కున చేర్చుకునేందుకు ప్రేమసమాజం సిద్ధంగా ఉందన్నారు. తల్లిదండ్రులను తమ బిడ్డలు ప్రేమాభిమానాలతో ఆదరించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త, సీనియర్ న్యాయవాది నాలుగెస్సుల రాజు వృద్ధులకు డైపర్స్, ఫ్రూట్స్‌ను అందించారు. కార్యక్రమంలో కార్యదర్శి రెడ్డి ఆదినారాయణ, కోశాధికారి బలివాడ అప్పారావు, ఉపాధ్యక్షులు ఎస్ఎన్ఎమ్.రాజు, కనకల రఘురామారావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ముస్తాబైన శివాలయాలు

- ఎస్‌వీఎన్ నగర్‌లో పశుపతినాథేశ్వరాలయంలో కొలువైన ద్వాదశ జ్యోతిర్లింగాలు
- జాగరణ చేసేందుకు భక్తులకు అవకాశం
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ ప్రతినిధులు



విద్యుత్ కాంతులతో ఉమారామలింగేశ్వరస్వామి వారి ఆలయం



విద్యుత్ కాంతులతో పశుపతినాథేశ్వరస్వామి ఆలయం

విజయనగరం టౌన్: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని జిల్లాలో శైవక్షేత్రాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ఆలయ కమిటీల ప్రతినిధుల నేతృత్వంలో సేవకులు లింగరూపధారి దర్శనానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. వేకువజామున 3 గంటల నుంచే స్వామివారికి అభిషేకాలు, అర్చనలు కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. ప్రతీ వ్యక్తి తమ జీవితంలో ద్వాదశ జ్యోతిర్లింగాలు చూడాలనుకుంటారు. ఎంతో వ్యయప్రయాసలకోర్చి కొన్నింటిని చూడగలుగుతారు. అన్నివర్గాల ప్రజలు ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకునేందుకు శ్రీ శారదా సేవా సంఘం ఆధ్వర్యంలో రింగురోడ్డు ఎస్‌వీఎస్ఎన్ నగర్‌లో శ్రీ విజయ గణపతి ద్వాదశ జ్యోతిర్లింగ సహిత అపర్ణాదేవీ సమేత శ్రీ పశుపతినాథేశ్వర స్వామి వారి ఆలయం మహాశివరాత్రి పర్వదినానికి ముస్తాబవుతోంది. వాటితో పాటూ ప్రకృతి సిద్ధంగా తయారైన స్ఫటిక లింగం ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులు ద్వాదశజ్యోతిర్లింగాలు, స్ఫటికలింగాన్ని దర్శించుకునేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్దనున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో కొలువైన వె అతి పురాతన మహాశివలింగానికి విశిష్ట పూజలు నిర్వహించనున్నారు. బాబామెట్టలో ఉన్న శివపంచాయతన ఆలయంలో వేకువజాము నుంచి విశిష్ట పూజలు నిర్వహించనున్నారు. వీటితో పాటూ కోట వద్దనున్న మూడుకోవెళ్లు, శివాలయం వీధిలో ఉన్న ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంతో పాటూ పలు శైవక్షేత్రాలు మహాశివరాత్రికి ముస్తాబయ్యాయి.



అలంకరణలో శివలింగం

మార్చి 9 నుంచి వేంకటేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాలు



వేంకటేశ్వర ఆలయంలో కొలువైన అలివేలిమంగ పద్మావతి సహిత శ్రీనివాసుడు

డెంకాడ: చింతలవలస ఐదవ ఏపీఎస్‌పీ బెటాలియన్ వద్ద ఉన్న కల్యాణ వేంకటేశ్వస్వామి ఆలయంలో స్వామి వారి 41వ వార్షిక కల్యాణ మహోత్సవాలు వచ్చే నెల మార్చి 9వ తేదీ నుంచి జరుగుతాయని ఆలయ కమిటీ మంగళవారం తెలిపింది. మార్చి 9వ తేదీ ఉదయం నుంచి స్వామివారి కల్యాణ ఉత్సవ పూజలు ప్రారంభమౌతాయన్నారు. సాయంత్రం 4.30 గంటలకు శ్రీవారి తిరువీధి ఉత్సవం జరుగుతుందని వివరించారు. 10వ తేదీన సాయంత్రం 6.30 గంటలకు వేదపండితుల ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. 11వ తేదీ సాయంత్రం 7 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఉన్న కోనేరులో తెప్పోత్సవం నిర్వహిస్తామన్నారు. 12వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్న సమారాధన జరుగుతుందని వివరించారు. ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు కూడా జరుగుతాయన్నారు.